
సాక్షి
మెదక్
బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023



రమణీయం.. రంగనాయక సాగరం

ఓవైపు ఆధ్యాత్మికం, మరోవైపు ఆహ్లాదం పంచుతున్న సిద్దిపేట జిల్లా రంగనాయక సాగర్ ఉత్తమ పర్యాటక గ్రామంగా ఎంపికైంది.


వివరాలు 8లో ▸



వైభవంగా మణిద్వీప వర్ణన పూజ

మండల కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం మహిళలు మణిద్వీప వర్ణన పూజ నిర్వహించారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు వైశ్య సంఘం నాయకులు హన్మయ్య, నగేష్, కూనరాములు, రఘురాం హాజరై పూజలు చేశారు. - చేగుంట(తూప్రాన్)

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్‌గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం.

89855 54525

ఇళ్లకు సౌర వెలుగులు

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సోలార్ యూనిట్‌లు
- సబ్సిడీపై అందించేందుకు సన్నాహం
- జిల్లాకు 350 యూనిట్లు మంజూరు



మనోహరాబాద్‌లో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

మెదక్: ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ గృహోపకరణాల వినియోగంతో రోజురోజుకు విద్యుత్ వాడకం పెరిగిపోతోంది. నెలవారి బిల్లులు చెల్లించలేక పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు బిల్లుల భారం తప్పించేందుకు ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై దృష్టి సారించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు సబ్సిడీ సోలార్ యూనిట్‌లు ఇచ్చేందుకు జిల్లా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇళ్లపై సోలార్ పరికరాల ఏర్పాటుతో ఇంటి అవసరాలకు పోను మిగతా విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించి అదనంగా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది.

జిల్లాలో 1,347 ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లు ఉండగా అందులో1.39 లక్షలు మంది సభ్యులు ఉన్నారు. సంఘాల సభ్యులను సోలార్ విద్యుత్ వైపు మళ్లించేందుకు స్త్రీనిధి శాఖ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. అర్హులైన సంఘాల సభ్యులకు వీటిని అందించేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. 2కిలో వాట్స్, 3 కిలో వాట్స్ సామర్థ్యం గల యూనిట్లు కేటాయిస్తున్నారు. రోజుకు ఒక కిలోవాట్ యూనిట్‌తో 4 యూనిట్లు, 3 కిలోవాట్స్ విద్యుత్ యూనిట్‌తో రోజుకు 12 యూనిట్ల వరకూ విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చని చెబుతున్నారు.

స్త్రీనిధి ఆధ్వర్యంలో..

2కిలో వాట్స్ గల యూనిట్‌కు రూ.1,44,000లు ఉంది. ఇందులో లబ్ధిదారుడి వాటా 1,14,822లు, ప్రభుత్వ సబ్సిడీ రూ.29,178, దరఖాస్తు, ఇతర రుసుం రూ.5,178లతో కలిపి మొత్తం రూ.1.20 లక్షలు అవుతోంది. స్త్రీనిధి నుంచి రూ.1.15 లక్షల రుణం అందిస్తున్నారు. ఇందులో లబ్ధిదారుడు తన వాటాగా రూ.5 వేలు చెల్లిస్తే సరిపోతుంది. 3 కిలోవాట్స్ యూనిట్‌కు రూ.2,06,400 ఉంది. ప్రభుత్వం రాయితీ రూ.49,764, లబ్ధిదారుడి వాటా రూ.1,56,636, దరఖాస్తు, ఇతర రుసుం రూ.3,364లు కలిపి మొత్తం రూ.1.60 లక్షలు అవుతుంది. స్త్రీనిధి కింద దీనిని రూ.1.50 లక్షలకు అందిస్తున్నారు. యూనిట్ పొందే లబ్ధిదారులకు తప్పని సరిగా ఆర్‌సీసీ భవనం ఉండాలని అధికారులు నిబంధన విధించారు. 350 నుంచి ఆపై యూనిట్ల విద్యుత్ వాడకం ఉండి, నెలకు కరెంట్ బిల్లు రూ.800 నుంచి రూ.వెయ్యికి పైగా చెల్లించేవారికి వీటిని అందించనున్నారు. ఇంటి అవసరాలకు పోను మిగతా విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయిస్తే అదనంగా ఆదాయం పొందవచ్చని సూచిస్తున్నారు. ఈ పరికరాలకు 25 ఏళ్ల వరకు వారంటీ ఉంటుంది. సమస్య తలెత్తితే సదరు కంపెనీ ఆధ్వర్యంలో మరమ్మతు చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాకు మొదటి విడత కింద 350 సోలార్ యూనిట్లు మంజూరయ్యాయి. 2, 3 కిలోవాట్స్ పరికరాలను సబ్సిడీపై అందిస్తున్నాం. గృహ వినియోగానికి పోను మిగిలిన విద్యుత్‌ను విక్రయంతో వచ్చే ఆదాయంతో రుణాన్ని చెల్లించవచ్చు. లబ్ధిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– గంగారాం, స్త్రీనిధి ఆర్‌ఎం, మెదక్

మృతుల పేర్లను తొలగించాలి

- రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ
- చిన్నశంకరంపేట, వెల్దుర్తిలో పర్యటన



సిబ్బందికి సూచనలు చేస్తున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ

చిన్నశంకరంపేట(మెదక్): ఓటరు జాబితా నుంచి చనిపోయినవారి పేర్లను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ అధికారులకు సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట ప్రాథమిక పాఠశాల, టీ.మాందాపూర్ తండా పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షాతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా, సవరణలపై ఆరాతీశారు. జాబితాలో గుర్తుపట్టలేకుండా ఉన్న ఫొటోలను తొలగించి నీట్‌గా ఉన్న ఫొటోలను చేర్చాలని సూచించారు. ఓటరు జాబితా ఎన్నిసార్లు సవరించినా మృతుల పేర్లు ఉంటున్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరి పేర్లు రెండు చోట్ల ఉండడం, ఒకే జాబితాలో రెండు ఓట్లు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని తొలగించాలన్నారు. పోలింగ్‌బూత్‌లను శుభ్రంగా ఉంచాలని, ఎన్నికలు జరిగే సమయానికి తప్పకుండా మార్పు కన్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ రాజేశ్వర్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఆర్‌ఐ చంద్ర శేఖర్ ఉన్నారు.

వెల్దుర్తి పోలింగ్ బూత్‌ల పరిశీలన

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మాసాయిపేట పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు డాక్టర్ క్రిస్టినా చొంగ్తూ పరిశీలించారు. ఓటరు నమోదు ప్రక్రియ, మృతుల పేర్ల తొలగింపు, ఆన్‌లైన్ దరఖాస్తులు తదితర అంశాలపై బీఎల్‌ఓను అడిగి తెలుసుకున్నారు. తప్పులు లేకుండా ఓటరు జాబితా సిద్ధం చేయాలని, మార్పులు, చేర్పులపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నర్సాపూర్, తూప్రాన్ ఆర్‌డీఓలు శ్రీనివాసులు, జయచంద్రరెడ్డి, డీఎస్పీ యాదిరెడ్డి, తహసీల్దార్ జ్ఞానజ్యోతి, ఉప తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

న్యూస్‌రీల్

భవన నిర్మాణానికి నిధులు



ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం చాకలి ఐలమ్మ 128వ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో రజక సంఘానికి భూమి కేటాయించామని, భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి శంకర్ నాయక్, సహాయ బీసీ సంక్షేమ అధికారి నాగరాజు, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కృష్ణారెడ్డి, గంగాధర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి, ఉపాధ్యక్షుడు చౌదరి మల్లేశం, యూత్ అధ్యక్షుడు విజయ్, యాదగిరి, లక్ష్మణ్, శివ పాల్గొన్నారు.

ఎరువుల కొనుగోళ్లకు రశీదులు తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు

రామాయంపేట(మెదక్): ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు డీలర్లకు ఆదేశించారు. నార్సింగి మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్, ఈపాస్ మిషన్, వివరాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయనతో రామాయంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు వసంత సుగుణ, మండల వ్యవసాయ అధికారి యాదగిరి ఉన్నారు.

కబ్జా చేస్తే కఠిన చర్యలు



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

హవేళిఘణాపూర్(మెదక్): అటవీ భూములను కబ్జా చేస్తే చర్యలు తప్పవని మెదక్ ఎఫ్ఆర్‌ఓ మనోజ్‌కుమార్ అన్నారు. అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని గంగాపూర్ గ్రామస్తులకు అటవీ సంరక్షణపై అవగాహన కల్పించారు. అటవీ భూములు ఆక్రమిస్తే ప్రభుత్వ పథకాలకు అనర్హులవుతారన్నారు. అడవుల సంరక్షణకు కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్, ఎంపీడీఓ శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజర్షిషా



సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో రూ.1.34 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని బుధవారం మంత్రి హరీశ్‌రావు ప్రారంభిస్తారని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం మండలంలోని ఆస్పత్రిని పరిశీలించి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ రమేష్, డీఎంహెచ్‌ఓ చందునాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అరుణశ్రీ, గడా ప్రత్యేక అధికారి ముత్యంరెడ్డి, ఆర్డీఓ జయచంద్రరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, పీఆర్‌డీఈ నర్సింలు, సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు ఉన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

తూప్రాన్: పట్టణంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి బుధవారం మంత్రి హరీశ్‌రావు వస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గడా ముత్యంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ రాజర్షిషాతో కలిసి పట్టణంలో పర్యటించి ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఇలాగైతే విధులు నిర్వర్తించలేం..

- ఏడీ తీరుపై మత్స్యశాఖ సిబ్బంది మండిపాటు
- మెదక్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న మత్స్యశాఖ సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: మత్స్యశాఖ ఏడీ రజిని తమను వేధిస్తుందని, ఇలాగైతే విధులు నిర్వర్తించలేము.. అంటూ ఆ శాఖ జూనియర్ అసిస్టెంట్ రాజుమహేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ భరత్ ఆరోపించారు. మంగళవారం తోటి సిబ్బంది ఆంజనేయులు, షాబొద్దీన్, డేవిడ్‌తో కలిసి మత్స్యశాఖ కార్యాలయం ఎదుట ఏడీ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడీ రజిని ఉద్దేశపూర్వకంగా తమను ఇబ్బంది పెడుతోందని, ఇటీవల దిగుమతి చేసుకున్న స్పాన్ వాతావరణ మార్పులతో చనిపోతే దానికి తమను బాధ్యులను చేసిందని అన్నారు. విధుల్లో ఉన్న తమపై లేనిపోని ఆరోపణలు చేస్తోందని వాపోయారు. ఈ విషయమై ఈ నెల 20న రాష్ట్ర కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు మెదక్ పట్టణంలో విద్యుత్ అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ జావేద్ తెలిపారు. విద్యుత్ స్తంభాల తొలగింపు, మరమ్మతు కారణంగా పట్టణంలోని పిల్‌దిడ్డి, బుస్సగడ్డ, కోలిగడ్డ, అరబ్‌గల్లీ, గ్రంథాలయం, బాలికల హైస్కూల్, బ్రాహ్మణవీధి, పెద్దబజార్, మార్కెట్, జీఎస్ రోడ్డు, రాందాస్ చౌరస్తా, కుమ్మరిగడ్డ, భారాహిమాం, పిట్లంబేస్, ఫిష్‌మార్కెట్, సంగం థియేటర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కౌల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో రెండు రోజులుగా జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. 21 మండలాల నుంచి 42 జట్లు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్ -14, 17బాలికలు, బాలుర విభాగాల్లో పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో అండర్-14లో మెదక్, శంకరంపేట, అండర్- 17లో మెదక్, రామయంపేట జట్లు విజేతగా నిలిచాయి. విజేతలకు కొడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏల్లుగారి శ్రీనివాస్ రెడ్డి బహుమతులు, జెర్సీలను అందజేశారు. కార్యక్రమంలో రంగంపేట స్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

హవేళిఘణాపూర్(మెదక్): ఎస్‌జీఎఫ్ జిల్లా కబడ్డీ పోటీల్లో మహాత్మా జ్యోతిరావు పూలె బాలికల విద్యార్థినులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రజిని తెలిపారు. అండర్-14, 17 కబడ్డీ పోటీల్లో విద్యార్థినులు సరస్వతి, సంజు, ఉమాదేవి ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు.

తూప్రాన్: జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో నర్సాపూర్ ఎంజేపీ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్షమ్యతరణం తెలిపారు. కబడ్డీ అండర్ 14 విభాగంలో హేమ, నందిని, సాహితీ, సంధ్య, లక్ష్మీ, భవాని, అండర్-17లో దీపిక, చందన, జానకీ జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఐలమ్మ జీవితం ఆదర్శం

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని



ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: ఆత్మ విశ్వాసాన్ని ఆయుధంగా మలచిన ఐలమ్మ జీవిత ఆదర్శమని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాములను ఎదిరించిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, సీఐ సందీప్‌రెడ్డి, ఆర్‌ఐనాగేశ్వర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లా వైద్యాధికారి చందునాయక్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ చందునాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహణ, పరీక్షలకు వస్తున్న మహిళలు, వైద్య పరీక్షల తీరుపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిసింధును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో శుభ్రతను పాటించాలన్నారు.

బాలుడి మృతదేహం లభ్యం



చరణ్ మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తెస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): రంగాయపల్లి చెరువులో గల్లంతైన బాలుడు చరణ్(10) మృతదేహం లభించింది. సోమవారం చెరువు వద్ద బాలుడిని కాపాడబోయి ముగ్గురు మహిళలు మృతి చెందగా, బాలుడు గల్లంతయ్యాడు. పోలీసులు గజ ఈతగాళ్లతో గాలించగా మంగళవారం ఉదయం మృతదేహం నీటిలో తేలింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నలుగురు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా మంగళవారం నిర్వహించిన లావణ్య అంత్యక్రియలకు రాష్ట్ర ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణం, నాయకులు పురం రవి, చంద్రశేఖర్ హాజరయ్యారు.

రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్



స్థల పరిశీలన జరుపుతున్న అధికారులు

- ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయ అభివృద్ధికి రూ.వంద కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. మంగళవారం దేవాదాయ శాఖ అధికారులతో కలిసి రాజ గోపురం, మునిపుట్ట, చెక్‌డ్యాం తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వన దుర్గమ్మ ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ వైశాల్యం పెంపు అంశాలను బృహత్ ప్రణాళికలో చేర్చనున్నట్లు తెలిపారు. బోనాలు, కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పణకు ప్రత్యేక స్థలం, రాజగోపురం నుంచి ఆలయం వరకు స్థపత మంటపం, ప్రసాదం తయారీ కేంద్రానికి స్థల పరిశీలన చేశారు. భక్తుల సామగ్రి పెట్టుకునేందుకు స్థలం, పాద రక్షల నిల్వ కేంద్రం, ఉద్యాన వనం ఏర్పాటు, సత్రాలు, డ్రైనేజీ, మరుగుదొడ్లు, తాగునీటి వసతి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో స్థపతి వల్లి నాయగం, ఎస్‌ఈ మల్లికార్జున్, పాలకమండలి చైర్మన్ బాలగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి, డీఈఈ ఓం ప్రకాష్, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలి..

- సెల్ టవర్ ఎక్కిన యువకులు
- ఎమ్మెల్యే హామీతో కిందకు..



టవర్ పైనుంచి దిగుతున్న యువకులు

నర్సాపూర్: సిట్టింగ్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డికి నర్సాపూర్ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐదుగురు యువకులు మంగళవారం రాత్రి సెల్ టవర్ ఎక్కారు. కౌల్చారం మండలానికి చెందిన రవీందర్ (తుక్కాపూర్), శ్రీకాంత్ (చిన్న ఘణపూర్), సురేష్‌గౌడ్ (పోతంశెట్టిపల్లి), అన్వేష్ (చిన్నఘనపూర్), దిగంబర్(తుక్కాపూర్)లు నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీకి ఎదురుగా ఉన్న పంట పొలాల్లోని సెల్‌టవర్ ఎక్కారు. కొద్దిసేపటికి దిగంబర్ టవర్ దిగి వెళ్లిపోగా.. మిగతా నలుగురు పైననే ఉండి ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. సీఐ షేక్‌లాల్ మధార్, ఎస్‌ఐ శివకుమార్ అక్కడికి చేరుకొని కిందికి దిగాలని నచ్చ చెప్పినా.. వారు వినలేదు. ఎమ్మెల్యేకు టికెట్ ఖరారు చేయాలని, లేదంటే రేపు ఉదయం వరకు ఇక్కడే ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం పోలీసులు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో యువకులను మాట్లాడించినా వినకుండా మొండికేశారు.

ఎమ్మెల్యే నచ్చజెప్పడంతో..



యువకులు టవర్ ఎక్కిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి.. హత్నూర మండల పర్యటనను ముగించుకొని హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. యువకులతో మాట్లాడి నచ్చజెప్పడంతో వారు కిందికి దిగారు. అనంతరం మదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎవరు నిరుత్సాహ పడొద్దని, పదవిలో ఉన్నా లేకున్నా.. అండగా ఉంటానని, చేసిన పనులే ఎన్నికల్లో గెలిపిస్తాయని అన్నారు. కార్యకర్తలు తనపై ప్రేమతో టవర్ ఎక్కారని, ఇలాంటి పనులు ఎవరూ చేయొద్దని, టికెట్ తనకే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా యువకులు టవర్ ఎక్కిన విషయం తెలిసి బీఆర్‌ఎస్ నాయకులు హబీబ్‌ఖాన్, భిక్షపతి, అక్కడికి చేరుకున్నారు.

క్లుప్తంగా

సుఖసంతోషాలతో ఉండాలి



కొడిపల్లి : భుజిరంపేటలో గణపతి విగ్రహం వద్ద సునీతారెడ్డి

కొడిపల్లి(నర్సాపూర్): వినాయకుని దయతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి తెలిపారు. మంగళవారం కొడిపల్లి, భుజిరంపేటలోని పలు వినాయక మంటపాల వద్ద ఆమె ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రవీన్ కుమార్, సత్తయ్య, శ్రీనివాస్, లింగం, దుర్గారెడ్డి, రాజిరెడ్డి, జగన్‌రెడ్డి, పోల నవీన్, మురళి, అనిల్, సంతోషగౌడ్, తిరుపతిరెడ్డి, కిషోర్‌గౌడ్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



సోమ్లానాయక్, గంజాయి ప్యాకెట్లు

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన అల్లాదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్వెర ఐబీ చౌరస్తాలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేగోడ్ మండలం పెద్దతండాకు చెందిన సోమ్లానాయక్, వడిత్య వసంత్‌లు చిల్వెర ఐబీచౌరస్తా వద్ద గ్లామర్ బైక్, స్కూటీతో ఉన్నారు. అక్కడికి పోలీసులు రాగానే ఇద్దరూ పారిపోయారు. వారిని వెంబడించిన పోలీసులు సోమ్లానాయక్‌ను పట్టుకున్నారు. అతని వద్ద ఐదున్నర కేజీల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. పారిపోయిన వసంత్ కోసం గాలిస్తున్నామని చెప్పారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోక్సో కేసులో వృద్ధుడి..

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని సూరారం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిని పోక్సో కేసులో అరెస్టు చేసినట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణ తెలిపారు. పెద్దపురం రాములు(65) ఓ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందుకు మంగళవారం పోక్సో కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మహిళల పట్ల అభ్యంతరకరంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట

నర్సాపూర్ : సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట పడుతామని మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. మంగళవారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు 21వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. పక్క రాష్ట్రమైన ఏపీలో మున్సిపల్ కార్మికులకు నెలకు రూ. 21వేల వేతనం అందజేస్తున్నారని, అదేవిధంగా తెలంగాణలో కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా కార్మికుల సమస్యలు అక్టోబరు 8 వరకు పరిష్కరించకుంటే సమ్మెబాట పడతామని హెచ్చరించారు. ఆయన వెంట కార్మికులు పుష్ప, రాములు, అశోక్, లచ్చయ్య, అనిత, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

16వ రోజుకు చేరిన సమ్మె

సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 16వ రోజుకు చేరింది. శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

రమణీయం.. రంగనాయక సాగరం

- ఒకేచోట ఆధ్యాత్మికం.. ఆహ్లాదకరం
- ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్న పచ్చదనం
- ఉత్తమ పర్యాటక గ్రామంగా చంద్లాపూర్
- నేడు అవార్డు అందజేయనున్న కేంద్రం



గుట్టపై గరుత్మంతుడి విగ్రహం

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆధ్యాత్మిక చెంతకు ఆహ్లాదం చేరింది.. భక్తి భావాల అంతరంగాలకు సాగర తరంగాలు తోడయ్యాయి. లక్ష్మీ రంగనాయక స్వామి వెలసిన ప్రదేశానికి జలహారం పడడం పండుగలకే పండుగైంది. ఫలితంగా చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. బుధవారం జాతీయ పర్యాటకదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్రప్రభుత్వం అవార్డు ప్రదానం చేయనుంది.


సిద్దిపేటకు 8 కిలోమీటర్ల దూరంలో చిన్నకోదూరు మండలం చంద్లాపూర్ శివారులో లక్ష్మి రంగనాయకస్వామి కొండ ఉంది. కొండపైన స్వామి వారు కొలువు దీరారు. ఆ భగవంతుడు ఆసీనుడైన చోట తన పేరిట రంగనాయక సాగర్ ఆవిర్భావం కావడం గ్రామానికి పెద్ద గుర్తింపు తెచ్చింది. ఆహ్లాద వాతావరణం, పచ్చటి పంటపొలాలు, ద్వీపాన్ని తలపించే సాగరం, అడుగడుగునా హరిత సంపద వంటి విశేషాల సమాహారం పర్యాటకులను ఆకట్టుకుంటోంది. విజ్ఞాన యాత్రలకు నెలవుగా మారింది.

సైక్లింగ్, పరుగు పోటీలకు వేదికగా నిలచింది. రిజర్వాయర్ మధ్యలో ఉన్న 50 ఎకరాల స్థలం ఒక ద్వీపంగా దర్శనమిస్తుంది. అక్కడే గెస్టు హౌస్, ఎస్ఈ కార్యాలయాలు నిర్మించారు. సుడా ఆధ్వర్యంలో రిసార్ట్ ప్రారంభించగా, ఇటీవల ఫార్మసీ కళాశాల ప్రారంభించారు. ఇక్కడే పలు నర్సరీలు, పార్కులు కూడా చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గ్రామం మొత్తం పచ్చదనంతో అలరారుతోంది. ప్రకృతి సహజత్వం ఉట్టిపడుతూ తీపి అనుభూతులను మదినిండా మూటకడుతుంది రంగనాయకసాగర్.. రంగనాయక స్వామి గుట్టపైకి కోటి రూపాయలతో చక్కని సీసీ రోడ్డు వేశారు.



బండరాయిలో వెలసిన రంగనాయక స్వామి విగ్రహం

పెద్దపెద్ద వాహనాలు సైతం గుట్టపైకి సులువుగా చేరేలా ఏర్పాటు చేశారు. గుట్టపై వివాహాలు చేసుకునేందుకు ఫంక్షన్ హాల్ కూడా నిర్మించారు. 68 అడుగుల గరుత్మంతుడి విగ్రహం భక్తులకు అదనపు ఆకర్షణగా నిలిచింది. అలాగే రిజర్వాయర్‌ను సందర్శించడానికి నిత్యం పర్యాటకుల తాకిడి పెరిగింది. దీంతో చంద్లాపూర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది.



రంగనాయక సాగర్ రిజర్వాయర్

సంతోషంగా ఉంది

రంగనాయక సాగర్ రిజర్వాయర్‌తో చంద్లాపూర్ గ్రామానికి జాతీయ స్థాయిలో ప్రతిష్ట లభించింది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో రిజర్వాయర్ నిర్మించడం, రంగనాయక స్వామి గుట్టను ఎంతో అభివృద్ధి చేయడంతో మా గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా ఆనందంగా ఉంది. దీనివల్ల గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది.

– చంద్రకళ, సర్పంచ్



మంత్రి కృషితోనే గుర్తింపు...

మంత్రి హరీశ్‌రావు కృషి, పట్టుదల ఆయన అందించిన తోడ్పాటు వల్లే ఈ గుర్తింపు వచ్చింది. రంగనాయక స్వామి గుట్టతో పాటు రంగనాయక సాగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. అక్కడే ఫార్మసీ కళాశాల, నర్సరీలు, పార్కులు ఏర్పాటు చేయడంతో మరింత శోభ సంతరించుకుంది. గ్రామానికి జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉంది.

– రోజాశర్మ, జెడ్పీ చైర్‌పర్సన్



పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్యం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



బస్వాపూర్‌లో పల్లె దవాఖానా నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

కోహెడరూరల్(హుస్నాబాద్): గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానలను ఏర్పాటు చేస్తుందని హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. మంగళవారం బస్వాపూర్ గ్రామంలో రూ.22లక్ష వ్యయంతో చేపట్టనున్న కంటి దవాఖాన భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అదే విధంగా బస్వాపూర్ గ్రామంలో రూ.కోటీ ఐదు లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తంగళ్ళపల్లి గ్రామంలో రూ.20లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న పల్లె దవాఖానకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రె శ్రీహరి, ఎంపీపీ కొక్కుల కీర్తి, సర్పంచ్ ఎడబోయిన సత్తయ్య, రైతు సమన్వయ మండల కోఆర్డినేటర్ పేర్యాల రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ కనకయ్య ఉన్నారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం సేవించి న్యూసెన్స్ చేసిన ఇద్దరికి సిద్దిపేట కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు సిద్దిపేట టూటౌన్ సీఐ రవికుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన జి.శివ, టి.వెంకటేష్‌లు నాలుగు రోజుల క్రితం మద్యం సేవించి పట్టణంలో ప్రజలను ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిపై ఈ పెట్టి కేసు నమోదు చేసి సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేష్‌బాబు ముందు హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి మంగళవారం వారికి ఆరు రోజుల జైలుశిక్షతో పాటు రూ.1,100 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి..

హుస్నాబాద్‌రూరల్: ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని మాలపల్లె గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శనిగరం భిక్షపతి, భారతి దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు అజయ్(24) ఇంటర్ వరకు చదువుకుని తండ్రికి వ్యవసాయ పనుల్లో సాయం చేస్తుంటాడు. మంగళవారం పశువులకు మేత వేసేందుకు వెళ్లిన అజయ్ పొలం వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అక్కడ ఉన్న బావిలో కాలుజారి పడిపోయాడు. పొలం దగ్గరకు వెళ్లిన కొడుకు తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు వెతికారు. బావిలో చూడగా చెప్పులు కన్పించాయి. స్థానికులు బావిలోకి దూకి అజయ్ మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



అజయ్(ఫైల్)



వెరీ కాస్ట్‌లీ గురూ..!

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వినాయక నవరాత్రి ఉత్సవంలో భాగంగా సిద్దిపేట పట్టణంలోని శ్రీపార్వతి మాత ఫ్యామిలీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపంలో గణనాథుని విగ్రహాన్ని రూ.15లక్షలతో అలంకరించారు. రూ.500 నోట్లు రెండు లక్షలు, రూ.200 నోట్లు రెండు లక్షలు, రూ.100 నోట్లు మూడు లక్షలు రూపాయలు, రూ.50 నోట్లు 3లక్షలు, 20 నోట్లు 4లక్షలు, రూ.10నోట్లు లక్షతో అలంకరించారు. ఈ ధన వినాయకుడిని తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు.

ఎమ్మెల్యేల స్కీమ్‌గా 'దళితబంధు'



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

మెదక్ కలెక్టరేట్: దళిత కుటుంబాలన్నింటికి దళిత బంధు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట వెల్దుర్తి మండలం రామాయపల్లి, ధర్మారం గ్రామాల దళితులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. దళితబంధు ఎమ్మెల్యేల స్కీమ్‌గా ప్రచారం జోరుగా సాగుతుందన్నారు. నాయకులు తమ బినామీలకు, అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే దళితబంధు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. దీంతో అర్హులైన దళితులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉపకులాల బుడగ జంగాల, మాల మాదిగల మధ్య చిచ్చు పెడుతున్నారని మండిపడ్డారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్, కృష్ణ, సుధాకర్, యాదగిరి, నర్సింలు, రాములు, పోచయ్య, సాయిలు, గట్టయ్య, లింగం, కిషన్, శేకులు, గట్టయ్య, పోచయ్య పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు నుంచి కిందపడి..

కొల్చారం(నర్సాపూర్): ఇంటి పైకప్పు సర్దుతూ ప్రమాదవశాత్తు కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నెల్లి సంగమేశ్వర్(35) ఈనెల 24న ఇంటిపై ఉన్న రేకులను సర్దుతుండగా కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయం కావడంతో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగమేశ్వరుని సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి కరెంట్ షాక్‌తో..

యువకుడి మృతి

హవేళిఘణాపూర్(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మెదక్ మండల పరిధిలోని మగ్దూంపూర్ గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన జక్కుల లాలు(29)తో పాటు అదే గ్రామానికి చెందిన రాము, ఏగొండ నరేశ్‌లు సోమవారం రాత్రి గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యామ్‌లో కరెంటు షాక్‌తో చేపలు పట్టేందుకు వెళ్లారు. లాలు నీటిలోకి దిగి చేపలు తీస్తున్న క్రమంలో విద్యుత్ ప్రసారం అవుతున్న వైరు అతని కాలికి తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతన్ని మెదక్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అమర్ తెలిపారు.



లాలు మృతదేహం

మద్యం తాగొద్దని మందలించినందుకు..

వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): మద్యంకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ మండల ర్యాలమడుగు పరిధిలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన శివారి గంగయ్య(45) కొంత కాలంగా తాగుడుకు బానిసయ్యాడు. మందు కోసం డబ్బు కావాలని భార్య సిద్దమ్మతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి రోజూ తాగితే ఎలా అని భర్తను భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గంగయ్య గ్రామంలోని దుర్గమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం వద్దకు వెళ్లాడు. తెల్లవారుజామున అందరూ ఇంటికి వెళ్లిన తర్వాత ఆలయ గేటుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంఘటన స్థలాన్ని మెదక్‌రూరల్ ఎస్ఐ అమర్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్..

యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు. అస్సాం రాష్ట్రంకు చెందిన అభిజిత్ బర్మన్(24), కర్మకర్(21) బతుకుదెరువు కోసం తొమ్మిది రోజుల క్రితం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ వచ్చారు. వీరి రాష్ట్రానికి చెందిన వారు ఉంటున్న భవనంలో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. మంగళవారం పని కోసం బైక్‌పై ఇద్దరు లక్డారం వైపు వెళ్లారు. ఓ పెట్రోల్ బంక్ లో పని మాట్లాడుకుని తిరిగి ఇస్నాపూర్ వైపు వస్తున్నారు. డీమార్ట్ గోదాం సమీపంలో రాగానే వీరు వస్తున్న బైక్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. దీంతో అభిజిత్ బర్మన్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన కర్మకర్‌ను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అభిజిత్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.



అభిజిత్ బర్మన్ (ఫైల్)

మహిళా సాధికారతే కేసీఆర్ లక్ష్యం

ఎంపీ కొత్తా ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మహిళలను అన్నిరంగాల్లో ముందు నిలపాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి కొత్తా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోటిలింగాల దేవాలయంలో మహిళా పొదుపు సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ఎంపీల పోరాట ఫలితమే పార్లమెంటు సమావేశాల్లో 33శాతం మహిళా బిల్లు అమలు చేశారన్నారు. గత ప్రభుత్వాలు మహిళలకు రూ 5లక్షలు రుణాలు మాత్రమే ఇచ్చేవని, ప్రస్తుత ప్రభుత్వం రూ.20 లక్షల వరకు అందిస్తున్నారని తెలిపారు. సీఏలు, సీసీల సమస్యను సీఎం పరిష్కరించారని గుర్తుచేశారు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల మాదిరిగా తమకు డ్రెస్‌కోడ్ కావాలని మహిళా సంఘాలు కోరగా పరిశీలిస్తామని వారికి హామీనిచ్చారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 1070మంది యువకులకు లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. అంతకుముందు కోటిలింగాల దేవాలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంఘాల రిసోర్స్ పర్సన్ మనోహర్‌రావు, ఏపీడీ రవీందర్, పీడీఎం రాజయ్య, శ్రీకాంత్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, కొమురయ్య, యాదగిరి, రాంరెడ్డి, కనకయ్య, రాంరెడ్డి, అరుణ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, ఎల్లం, నర్సింలు, మల్లయ్య, కలీముద్దిన్, శ్రీధర్, పాల్గొన్నారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

మిరుదొడ్డి(దుబ్బాక): పట్టణాలకు దీటుగా పల్లెలను అభివృద్ధి చేయడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ కొత్తా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అల్వాలలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, ఎండీ అహ్మద్, ఎనగంటి కిష్టయ్య, రాజు పాల్గొన్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్‌తో దృఢ నిర్మాణాలు

మెదక్ కలెక్టరేట్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని సంస్థ మార్కెటింగ్ చీఫ్ మేనేజర్ సతీష్ కుమార్ తెలిపారు. మంగళవారం మెదక్ లోని శ్రీ రామలింగేశ్వరా ట్రేడర్స్ ఆధ్వర్యంలో ఇంజినీర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టెక్నికల్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ.. వికాట్ గ్రూప్ కంపెనీస్ ప్రపంచంలో 11 దేశాలలో విస్తరించి ఉన్నాయని తెలిపారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపుకి చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ ను తెలంగాణ లో విడుదల చేసినట్లు తెలిపారు. కాంక్రీట్ తయారీలో ఉపయోగించే నూతన టెక్నాలజీ, దృఢమైన కాంక్రీట్‌ను తయారు చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ రకాల కాంక్రీట్‌ల గురించి ఇంజినీర్లకు క్లుప్తంగా వివరించారు. మార్కెట్ లో లభించే ఇతర సిమెంట్ తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ తో నిర్మాణ ప్రక్రియ చాల వేగవంతంగా పూర్తవుతుందన్నారు. నిర్మాణం యొక్క దృఢత్వం చాలా అధికంగా ఉంటుందని తెలియచేశారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడతారని తెలియచేశారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ గంగాధర్ రెడ్డి, డీలర్ లింగమూర్తి, స్థానిక ఇంజనీర్లు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న భారతి సిమెంట్ ప్రతినిధులు